
సమావేశంలో ఆర్. కృష్ణయ్య, కిషోర్‌యాదవ్ తదితరులు

బీసీల డిమాండ్ల సాధన కోసం
యువజన విభాగం పోరాటాన్ని ఉధృతం చేయాలి

రాంనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం బీసీలకు కల్పించిన హక్కులు, డిమాండ్ల సాధన కోసం బీసీ యువజన విభాగం పోరాటాన్ని ఉధృతం చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య సూచించారు. మంగళవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ యువజన విభాగం జాతీయ ఉపాధ్యక్షుడు సి.కిషోర్‌యాదవ్ ఆధ్వర్యంలో బీసీ యువజన సంఘం సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. 42 శాతం రిజర్వేషన్ల అమలు, పెండింగ్‌లో ఉన్న బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్, విదేశీ విద్య నిధులు, బీసీ హాస్టల్స్‌కు సొంత భవనాల నిర్మాణం, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు వంటి డిమాండ్లపై బీసీ యువజన విభాగం పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం, యువజన సంఘం నాయకులు జి.అనంతయ్య, నీల వెంకటేష్, సి.రాజేందర్, వేణుయాదవ్, మహేష్‌యాదవ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధర తగ్గించాలి : టీడీపీ

రాంనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్‌పై రూ. 50 పెంచడం విచారకరమని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా అన్నారు. పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు భారీగా పతనమవుతున్న నేపథ్యంలో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెంచడం సమంజసం కాదన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు సతమతమవుతుంటే, గ్యాస్ ధర పెంచడం సామాన్యుడిపై భారం మోపడేమనన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, పలుస బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో రూ. 2,752 కోట్లు విడుదల

- పదేళ్లలో బీఆర్ఎస్ ఇచ్చింది రూ. 3,652 కోట్లు మాత్రమే
- మేయర్ విజయలక్ష్మి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం జీహెచ్ఎంసీకి రూ.2,752 కోట్లు విడుదల చేసిందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నగరాన్ని గ్లోబల్ సిటీగా తీరిదిద్దాలన్న ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో 2014 నుంచి 2023 వరకు రూ.3,652.71 కోట్ల నిధులు విడుదల చేశారని తెలిపారు. ఇందులో రాష్ట్ర ఆర్థిక కార్పొరేషన్ గ్రాంట్లు రూ.1,415.39 కోట్లు, స్టాంప్ డ్యూటీ రూ.1,776.53 కోట్లు, బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో రూ.460.79 కోట్లు విడుదల చేశారన్నారు. ప్రస్తుత సర్కారు 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీహెచ్ఎంసీకి రూ.6,045 కోట్లు కేటాయించగా.. రూ.2,752 కోట్లు విడుదల చేసిందని పేర్కొన్నారు. ఇందులో బడ్జెట్‌లో కేటాయించిన రూ.2,965.61 కోట్లలో రూ.1552.52 కోట్లు, స్టాంప్ డ్యూటీ రూ.1150 కోట్లు, ఆర్థిక కమిషన్ గ్రాంట్లు రూ.49.36 కోట్లు ఉన్నాయన్నారు.

బాపూజీనగర్‌లో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలి

ముషీరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బాపూజీ నగర్‌లో బస్తీ దవాఖానా ఏర్పాటుకు కృషి చేయాలని స్థానిక మహిళలు కాంగ్రెస్ నగర కార్యదర్శి తమగొండ రాజ్‌దీప్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు మంగళవారం బాపూజీ నగర్‌లో రాజ్‌దీప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాజ్‌దీప్ మాట్లాడుతూ.. బాపూజీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆస్పత్రి ఏర్పాటు విషయాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్ యాదవ్, మాజీ అధ్యక్షుడు జీఎన్ చారి, సీనియర్ నాయకుడు రమేష్‌రాం తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో రాజ్యాంగ పరిరక్షణ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సామాన్యులు, ముఖ్యంగా యువతీ, యువకులు, విద్యార్థుల్లో రాజ్యాంగంపై తప్పనిసరిగా అవగాహన కల్పించాలని, అప్పుడే దాని స్ఫూర్తిని కాపాడుకోగలమని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా ఎవరివాటా వారికి అందజేసి సామాజిక, ఆర్థిక అసమానతలను నిర్మూలించడానికి ప్రయత్నాలు సాగించాలని ఆకాంక్షించారు. దళిత స్త్రీశక్తి ఆధ్వర్యంలో మంగళవారం 'రాజ్యాంగ పరిరక్షణ - భవిష్యత్ ప్రణాళిక' అంశంపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి బి.ఎమ్ వినోద్‌కుమార్, ఆంధ్రమహిళా సభ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ వసుంధరాదేవి, ప్రొఫెసర్ రజిత, భూమిక ఉమెన్స్ కలెక్టివ్ కొండవీటి సత్యవతి, కృష్ణకుమారి తదితరులు మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించుకోవడంలో పౌరుల పాత్ర ప్రధానం అని అన్నారు. కుల, మత, వర్గ వైషమ్యాలకు అతీతంగా సమాజంలో శాంతి, సామరస్యాలు, వర్థిల్లాలంటే రాజ్యాంగమే శరణ్యమని వక్తలు నొక్కిచెప్పారు. దళిత స్త్రీశక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ సభాధ్యక్షతన సాగిన సభలో ఎంవీఎఫ్ ప్రతినిధి వెంకటరెడ్డి, అడ్వకేట్ ప్రకాష్, సాధన తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానాన్ని ప్రకటించాలి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పాత పించన్ పథకం (ఓపీఎస్)ను ప్రకటించే వరకు దశలవారీగా పోరాటాలకు సిద్ధం కావాలని ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(పీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి సంఘం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నగరంలో మంగళవారం పీటీఏ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.మల్లికార్జున్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శారద, రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శిగా శౌరి, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పార్థసారథి, ప్రభాకర్, చీఫ్ ప్యాట్రన్లుగా కేఎస్ ప్రకాష్‌రావు, బద్రీ నారాయణ రావు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కాగా, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా వరలక్ష్మి, కార్యదర్శిగా బబితాకుమారి, కో-ఆర్డినేటర్‌గా లావణ్య, నేషనల్ కౌన్సిలర్‌గా విక్రంభాయిని ఎన్నుకున్నారు.

భక్తిని నింపిన ఆధ్యాత్మిక గీతాలాపన

చిక్కడపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా మంగళవారం సాయంత్రం ఎస్‌బీఐ మాజీ ఏజీఎం చింతలపూడి త్రినాథరావు భక్తిగీతాల కార్యక్రమం శ్రోతల్లో భక్తిని నింపింది. పలు భక్తిగీతాలు ఆలపించి భక్తులను తన్మయులను చేశారు. ఆలయ ఈవో మాచర్ల దేవనాథం, పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్ త్రినాథరావును సన్మానించి అభినందించారు.

తవ్వారు.. వదిలేశారు

- నత్తనడకన వర్షపు నీటి పైపులైన్ పనులు
- నెలరోజులవుతున్నా పూర్తికాని వైనం
- వాహనదారుల ఇబ్బంది



ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు ఏర్పాటు చేసిన బోర్డు


వీఎస్టీ రోడ్డులో కొనసాగుతున్న పైపులైన్ పనులు

రాంనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల వీఎస్టీ రోడ్డులో చేపట్టిన వర్షపునీటి పైపులైన్ నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. నెల రోజులుగా పనులు కొనసాగుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గాన్ని మూసివేయడంతో వీఎస్టీ నుంచి రాంనగర్, విద్యానగర్ వెళ్లే ట్రాఫిక్‌ను ఆర్టీసీ ముషీరాబాద్ డిపో నుంచి బీఈ కంపెనీ చౌరస్తా వైపు మళ్లించడంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకల రద్దీ పెరిగి ట్రాఫిక్ జామ్ అవుతోంది.

జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనులను త్వరితగతిన పూర్తిచేసి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పనులు వేగవంతం కావడం లేదు. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైపులైన్ పనులు త్వరగా పూర్తిచేయడానికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి.

- కె. రవిచారి, కార్పొరేటర్, రాంనగర్

వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తాం



వీఎస్టీ మెయిన్ రోడ్‌లో కొనసాగుతున్న వర్షం నీటి పైపులైన్ నిర్మాణ పనులను వారం రోజుల్లో పూర్తి చేస్తాం. మ్యాన్‌హోల్ మరమ్మతు పనులు కూడా జరుగుతుండడంతో పైపులైన్ నిర్మాణ పనులు ఆలస్యం అయింది. పనులను వేగవంతం చేస్తాం. - శివకుమార్, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

బీజేపీ కార్యకర్తలకు ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ పిలుపు


మహాత్మానగర్‌లో బీజేపీ జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న లక్ష్మణ్

ముషీరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ కార్యకర్తలకు రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ పిలుపునిచ్చారు. మంగళవారం భోలక్‌పూర్ డివిజన్ మహాత్మానగర్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కో-ఆర్డినేటర్ బిజ్జి కనకేష్ కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. పార్టీ జెండాను లక్ష్మణ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు పక్కా గృహాలు కట్టిస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన మాటను విస్మరించారని ఆరోపించారు. అదే బాటలో సీఎం రేవంత్‌రెడ్డి సైతం వ్యవహరిస్తున్నారని అన్నారు. భూములను అమ్ముతున్నారని ఆరోపించారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రతీ పోలింగ్ బూత్‌లో నిర్వహిస్తూ, బీజేపీ సిద్ధాంతాలు, ఆశయాలు ప్రజలకు వివరిస్తూ పార్టీని వారికి మరింత చేరువ చేయాలన్నారు.

కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ విశ్వం, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్, మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో..

ముషీరాబాద్‌లో బీజేవైఎం అధికార ప్రతినిధి బుర్రా రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్, ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్ పాల్గొన్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించి వారు మాట్లాడారు. డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం. నవీన్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ బూత్‌లో బీజేపీ జెండా ఆవిష్కరించాలి

రాంనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతీ బూత్‌లో బీజేపీ పతాకాన్ని ఆవిష్కరించాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ పిలుపునిచ్చారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం సాయంత్రం బాగ్‌లింగంపల్లిలో రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి ఆధ్వర్యంలో జరిగిన వేడులకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు.

రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. దిల్‌సుఖ్‌నగర్‌లో జరిగిన బాంబు పేలుళ్ల కుట్రదారులకు కోర్టు ఉరిశిక్ష విధించడాన్ని ప్రజలు హర్షిస్తున్నారని అన్నారు. నగరంలో ఐఎస్ఐ తీవ్రవాదుల ఆనవాళ్లు లేకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి మాట్లాడుతూ.. డివిజన్‌లోని అన్ని బస్తీలు, కాలనీలలో పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి. భరత్‌కుమార్, ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు గడ్డం సతీష్, నాయకులు గడ్డం నవీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యాధులను గుర్తించేందుకు
నెలరోజులు ఇంటింటి సర్వే

ముషీరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జీవన శైలి మార్పుల వల్ల వచ్చే వ్యాధులను గుర్తించేందుకు నగరంలో నెల రోజులపాటు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని హైదరాబాద్ జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ జె. వెంకటి తెలిపారు. మంగళవారం ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బంది, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించి ఇంటింటి సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు నెలరోజుల పాటు ఆస్పత్రి పరిధిలోని ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టాలని సూచించారు. ఇందులో భాగంగా బీపీ, మధుమేహం, ఊబకాయం, త్రోట్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ తదితర వ్యాధులతో బాధపడుతున్నవారిని గుర్తించి వైద్య సేవలు అందించేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ఎం. మనోజ్‌రెడ్డి, పీహెచ్ఎన్‌లు పెల్లీస్, కళావతి, ఏఎన్ఎంలు విజయకుమార్, సునీత, సంతోషిణి, అనురాధ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


ఏఎన్ఎం, ఆశావర్కర్లకు ఇంటింటి సర్వేపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యశాఖ అధికారి జె. వెంకటి

త్వరలో డాక్టర్ పోస్టుల భర్తీ

నగరంలోని ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తుందని అన్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

రాంనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని కార్మిక సంఘాల ప్రతినిధులు ఆరోపించారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో దేశవ్యాప్తంగా మే 20న జరిగే సార్వత్రిక సమ్మెకు మద్దతుగా సదస్సు జరిగింది. ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసఫ్, హెచ్ఎంఎస్ నాయకుడు అమ్జాద్, సీఐటీయూ నాయకుడు సాయిబాబా, టీయూసీఐ నాయకుడు కె.సూర్యం, టీఎస్‌టీయూసీ నాయకుడు ఎం.కె.బోస్, బీఆర్‌టీయూ నాయకుడు జి.రాంబాబుయాదవ్ తదితరులు మాట్లాడారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. ఈ నెల 10 నుంచి 20 వరకు జిల్లాల వారీగా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. బైక్ ర్యాలీలు జరుగుతాయని, సమ్మె రోజున ఇందిరాపార్కు వద్ద భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు.

బల్కంపేట ఎల్లమ్మకు బోనం


ఎల్లమ్మకు బోనం తీసుకెళ్తున్న బీసీ సంక్షేమ సంఘం మహిళా కమిటీ అధ్యక్షురాలు కళావతి

ముషీరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం మహిళా కమిటీ అధ్యక్షురాలు కళావతి ఆధ్వర్యంలో బల్కంపేట ఎల్లమ్మకు మంగళవారం బోనం సమర్పించారు. బీసీ బిల్లు ఆమోదం పొందడం కోసం బోనం సమర్పించినట్లు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు రాజేందర్, టీఆర్ గోవింద్, మహిళా కమిటీ నాయకులు మహేశ్వరి, శివాని పాల్గొన్నారు.

ఆర్మీ డాగ్స్‌కు వైద్యం చేయాలంటూ మోసం

- వెటర్నరీ డాక్టర్ నుంచి రూ. 1.79 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆర్మీడాగ్స్‌కు వైద్యం చేయాలంటూ వెటర్నరీ డాక్టర్‌ను సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించి రూ.1.79 లక్షలు కొల్లగొట్టారు. నగరానికి చెందిన వెటర్నరీ డాక్టర్‌కు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి తనను తాను ఆర్మీ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. 'మా వద్ద ఆర్మీకి చెందిన 90 కుక్కలు ఉన్నాయి. వాటికి టీకాలు సహా.. అవసరమైన వైద్య పరీక్షలు చేయాలి. అందుకు అవసరమైన డబ్బును మేమే చెల్లిస్తాం' అని నమ్మించాడు. మీ ప్రొఫైల్ నచ్చిందని, ఇకపై మీరే మా కుక్కలకు వెటర్నరీ డాక్టర్ అని నమ్మించాడు. ఆర్మీ నిబంధనల ప్రకారం.. మీకు చెల్లించాల్సిన డబ్బులో 50 శాతం ముందుగానే చెల్లించాల్సి ఉన్నందున పంపిస్తామంటూ వీడియోకాల్ చేశాడు.

మొదట మీరు కొంత నగదు బదిలీ చేయాలని, లావాదేవీ సరిగా ఉందని తేలితే మొత్తం డబ్బులు చెల్లిస్తామన్నాడు. అలా అతడి ద్వారా డబ్బులు చెల్లింపులు చేసుకొని, క్రెడిట్ కార్డులోని రూ. 1.79 లక్షలు కొల్లగొట్టాడు. డబ్బు తిరిగి రాకపోవడంతో మోసపోయినట్టు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేత


బాకారంలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

రాంనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలను జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం కూల్చివేశారు. రాంనగర్ డివిజన్ బాకారంలో బీజేపీ నాయకుడు అరుణ్ నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తు నిర్మించాడు. జీహెచ్ఎంసీకి ఫిర్యాదు అందడంతో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య ఆధ్వర్యంలో సిబ్బంది కూల్చివేశారు. బాగ్‌లింగంపల్లి అచ్చయ్యనగర్‌లో కాంతారావు అనే వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా ఇల్లు నిర్మించారని బస్తీవాసులు ఫిర్యాదు చేయడంతో అధికారులు కూల్చివేశారు గోల్కొండ చౌరస్తా ప్రధాన రహదారిలో పలు ఆక్రమణలను కూడా తొలగించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది శ్రీధర్‌గౌడ్, అనిల్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

బాంబు పేలుళ్ల ఘటనపై హైకోర్టు తీర్పు హర్షణీయం

- బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ఎన్. గౌతంరావు

బర్కత్‌పుర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్‌లో జరిగిన జంట బాంబు పేలుళ్ల ఘటనపై హైకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయం అని హైదరాబాద్ స్థానిక సంస్థల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. మంగళవారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమాయకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదులకు ఉరిశిక్ష వేయడం సంతోషకరం అన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, ఉగ్రవాదాన్ని ఎవరూ సమర్థించరన్నారు. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలని గౌతంరావు డిమాండ్ చేశారు.


టీఆర్‌టీ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ యాకర అమృత

నర్సింహబస్తీ-టీఆర్‌టీ కాలనీ రోడ్డులో
వాహనాలు పార్క్ చేయకుండా చర్యలు తీసుకోవాలి

నల్లకుంట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నర్సింహబస్తీ నుంచి టీఆర్‌టీ కాలనీకి వెళ్లే దారిలో ఇరువైపుల ఇటీవల వాహనాల అక్రమ పార్కింగ్‌తోపాటు రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని కార్పొరేటర్ యాకర అమృత అన్నారు. వాహనాలను పార్క్ చేయకుండా, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం నల్లకుంట డివిజన్‌లో జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ ఏఎంహెచ్‌వో హేమలత, ట్రాఫిక్ పీఎస్ సిబ్బందితో కలిసి కార్పొరేటర్ ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. టీఆర్‌టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎస్.నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి కె.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గానగర్‌లో లోప్రెషర్ సమస్య పరిష్కారానికి చర్యలు


దుర్గానగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్

అంబర్‌పేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దుర్గానగర్‌లో అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ గురువారం పర్యటించారు. బస్తీవాసులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీరు లోప్రెషర్‌తో సరఫరా అవుతోందని ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రేమ్‌నగర్ కచ్చామోరీ నాలాలో పేరుకుపోయిన చెత్తను జలమండలి సిబ్బందిని పిలిపించి తొలగింపజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ ఎం. చిమ్నా తెలిపిన వివరాల ప్రకారం.. 35 ఏళ్ల వయసు గల వ్యక్తి బుద్వేల్-శివరాంపల్లి రైల్వే స్టేషన్ల మధ్య మంగళవారం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు రైల్వే కూలీ..

ప్రమాదవశాత్తు రైల్వే కూలీ మృతి చెందాడు. కాచిగూడ రైల్వేపీఎస్ హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన శిబనాద్‌బాను(60) డబీర్‌పుర రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాల వెంట జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తున్నాడు. సోమవారం రాత్రి పనులు పర్యవేక్షిస్తుండగా ప్రమాదవశాత్తు జారి కంకర, ఇనుపసువ్వలపై పడిపోయాడు. తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాకింగ్‌కు వచ్చి విద్యార్థి..


సాదుద్దీన్ (ఫైల్)

కవాడిగూడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని విద్యార్థి మృతి చెందాడు. దోమలగూడ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేపల్లి ప్రాంతానికి చెందిన మహ్మద్ సాదుద్దీన్(22) డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రతీరోజూ ట్యాంక్‌బండ్‌కు వచ్చి వాకింగ్ చేస్తుంటాడు. మంగళవారం ద్విచక్రవానంపై వాకింగ్‌కు వచ్చాడు. ఉదయం 6 గంటలకు వాకింగ్ ముగించుకొని ద్విచక్రవాహనంపై రాణీగంజ్‌వైపు వెళ్తున్నాడు. ఐ లవ్ హైదరాబాద్ వద్ద వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం సాదుద్దీన్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. విద్యార్థి చేయి విరిగిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. తండ్రి సిరాజుద్దీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చలివేంద్రం ప్రారంభం


బీఆర్ఎస్ నగర నాయకుడు సాయిగౌడ్ ఆధ్వర్యంలో నాగమయ్యకుంట చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ముఠా గోపాల్ మంగళవారం ప్రారంభించారు. వేసవిలో పాదచారులకు దాహం తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయన్నారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం


రాంనగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు వెలిశెట్టి సుధాకర్ గుప్తా, మహిళలు పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

సత్కారం


వాజ్‌పేయితో కలిసి పార్టీలో నాడు పనిచేసిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రొయ్యూరు శేషసాయిని సత్కరిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్